క్లుప్తంగా

78 మందికి కంటి వైద్య పరీక్షలు



కంకిపాడు: కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని నెప్పల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 78 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. శుక్లాలు ముదిరినట్లు గుర్తించిన వృద్ధులకు శస్త్రచికిత్స నిమిత్తం రిఫర్ చేశారు. కంటి సమస్యలపై రాజేష్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.శ్రీధర్, సిహెచ్‌ఓ ఎస్.బిందుమాధవి, వీహెచ్‌ఎస్ విక్టోరియా, ఆశ కార్యకర్తలు ఝాన్సీ రాణి, జ్యోతి, స్థానికులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో నాణ్యమైన పంటల దిగుబడి



గన్నవరం రూరల్: రైతులు సస్య రక్షణ చర్యలతో నాణ్యమైన పంటలు పండించాలని మచిలీపట్నం డీఆర్‌సీ సైంటిస్ట్‌లు కె.జ్యోతి రమణి, డి.సుధారాణి, కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని తెంపల్లి గ్రామంలో బుధవారం వరి పంటలు పరిశీలించి సీడ్ విలేజ్ ప్రోగ్రాం గురించి వివరించారు. రైతాంగం నాణ్యమైన దిగుబడులు సాధించటంతో పాటు వచ్చే ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలను గ్రామంలోనే తయారు చేసుకోవాలని చెప్పారు. రసాయనిక ఎరువులకు దూరంగా సాగు చేయాలని, దీంతో మంచి విత్తనాలు లభిస్తాయని చెప్పారు. వరిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, వేరుశనగలో వేరు కత్తెర పురుగు నివారణ చర్యలు వివరించారు. వీఆర్వో మురళీకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు శివనాగరాజు పాల్గొన్నారు.

రేపు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఈ. సత్యకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ప్రభుత్వ శాఖల పనితీరు, సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద సచివాలయం-2 పరిధిలో ఈ నెల 9వ తేదీన విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గోగులమూడి తిరీష్‌బాబు కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైంది. తక్షణ సహాయం కింద మట్టి ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి సర్పంచ్ వి.రాధాకృష్ణ బుధవారం రూ.10 వేలు అందజేశారు. వెల్ఫేర్ సెక్రటరీ చిన్ని సురేష్, సచివాలయం కార్యదర్శి పి.ఏ సుపా ఉదయశ్రీ, ఎంపీటీసీ సభ్యులు షేక్ మున్ని, భాగ్యరాజ్, వలంటీర్ కైలే జ్యోతి పాల్గొన్నారు.

పది మందిపై బైండోవర్ కేసులు

కంకిపాడు: పది మందిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఈ నెల 19న ఉప ఎన్నికల నేపథ్యంలో పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పలువురు వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే ప్రక్రియలో భాగంగా ముందస్తుగా బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఫైల్‌పై సంతకం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారని వైఎస్సార్ టీయూసీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్ నంబూరు ప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
ఉద్యోగుల శ్రేయస్సే లక్ష్యంగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మేలు చేశారని గుర్తు చేశారు. తండ్రి ఆశయాలను నెరవేర్చే క్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన బాటలోనే పయనిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటూ వచ్చే ఎన్నికల్లో ఆయన్ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని తెలిపారు.

పేదల పక్షాన సీఎం జగన్

ఎమ్మెల్యే పార్థసారథి



సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: ప్రతిపక్షాలది రాజకీయ కుట్రేనని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని తెలియజేశారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని, సంక్షేమ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం నడుస్తుందని తెలిపారు. సంక్షేమ పాలనతో సీఎం జగన్ పేదల పక్షాన నిలుస్తుంటే కుట్రలు, కుతంత్రాలతో ప్రతిపక్షాలు పెత్తందారులకు కొమ్ము కాస్తున్నాయని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఏ కుటుంబాన్ని కలిసి అడుగుతున్నా జగనన్న చేసిన మేలును చెబుతున్నారని పేర్కొన్నారు. ఉయ్యూరు అభివృద్ధి అజెండాగా పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, రాజులపాటి రామచంద్రరావు, షేక్ అబు కలాం, అబ్దుల్ సద్దాం వెంట్రప్రగడ బాబ్జీ, సంపత్‌కుమార్, గూడపాటి రాజు, నరేష్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదేశించారు. కానూరులో ఎమ్మెల్యే కార్యాలయంలో తాడిగడప మున్సిపాలిటీ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రూ.26.39 కోట్లతో 126 అభివృద్ధి పనులు చేయాల్సి ఉందన్నారు. పనులకు వెంటనే టెండర్లు పిలిచి చేపట్టాలని చెప్పారు. అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం చేయరాదన్నారు. ఇంజినీరింగ్ అధికారులు, అసిస్టెంట్‌లు సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. అక్టోబర్ నెలకల్లా అభివృద్ధి పనులు పూర్తి చేసే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా గడప గడప కార్యక్రమంలో ప్రజలకు హామీ ఇచ్చిన పనులు ముందుగా చేపట్టాలని కోరారు. పనులు చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు వెంటనే చెల్లించాలని తెలిపారు. టెండర్లు వేసి పనులు చేయని కాంట్రాక్టర్లను నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు సమస్యలు గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. తాడిగడప మున్సిపాలటీ ప్రగతి పథంలో పయనించాలని కోరారు. కమిషనర్ ఎస్.ప్రకాశరావు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలి

కంకిపాడు: ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వీఓఏ, గ్రామైక్య సంఘాల ప్రతినిధులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి, కుటుంబాల ఉన్నతికి ప్రభుత్వం సమర్థంగా చర్యలు చేపడుతుందన్నారు. సబ్సిడీ రుణాలను ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా చూడాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి పూర్తిగా తీసుకెళ్లాలన్నారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సబ్సిడీ రుణాలు, పథకాలు సద్వినియోగం కావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పథకాలు అందిస్తుందన్నారు. జీవనోపాధుల వృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు

దీఈ శ్రీనివాసరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను సత్వరంగా మంజూరు చేస్తామని ఏపీ సీపీడీసీఎల్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాపులపాడు, ఉంగుటూరు మండలాలకు చెందిన రైతులు సంబంధిత చార్జీలు చెల్లించిన 30 రోజుల లోపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎప్పటికప్పుడు ఎస్టిమేషన్ చార్జీలు చెల్లించిన రైతుల జాబితాను తమ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. ఎస్టిమేషన్ పూర్తి అయిన దరఖాస్తుల వివరాలు కూడా మరో జాబితాను నోటీస్ బోర్డులో ఉంచుతామని వివరించారు. 'మొదట ఛార్జీలు చెల్లించిన వారికి మొదట పని' అనే పద్ధతిలో ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పనులు నిర్వహిస్తామని చెప్పారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శనీయం



పోరంకిలో గౌతులచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

పెనమలూరు: స్వాతంత్ర్య సమరయోధుడు బీసీ నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న 115వ జయంతి పోరంకిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీసీ నేతలు సర్దార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ నేత బొర్రా కృష్ణ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి, సంక్షేమానికి గౌతులచ్చన్న పోరాటం చేశారన్నారు. ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పై గౌతులచ్చన్న చేసిన పోరాడిన తీరు ఎనలేనిదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా కనకదుర్గ, బీసీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటస్వామి, నేతలు బొర్రా శ్రీనివాసరావు, అంకెం రాజేష్, అరుణ్‌బాబు, తెన్నేటి ప్రకాష్, వెల్లవర్తి లక్ష్మి, పరసా బాలకృష్ణ పలువురు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ జవహర్ నవోదయ విద్యాలయలో అడ్మిషన్ కోసం నిర్వహిస్తున్న ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆన్‌లైన్ దరఖాస్తులో నింపిన వివరాల్లోని పొరపాట్లను సరిచేసుకొనుటకు ఈ నెల 26, 27 తేదీల్లో అవకాశం కల్పిస్తున్నట్లుగా చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. టీచర్స్‌కాలనీకి చెందిన బండి కరుణాకర్‌రావు మంగళవారం బైక్ పై వెళుతున్న సమయంలో తులసీనగర్ 3వ లైన్ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కరుణాకర్ తలకు తీవ్ర గాయాలు అయ్యి అపస్మారక స్థితిలో ఉండగా సమాచారం తెలుసుకున్న మిత్రుడు చలమలశెట్టి చక్రవర్తి బాధితుడిని పోరంకిలోని ప్రైవేటు ఆస్పత్రిలో అత్యవసర వైద్య చికిత్సకై చేర్చాడు. ఈ ఘటన పై ఫిర్యాదు అందటంతో కేసు నమోదు చేశారు.

ఇద్దరు అధికారులకు ప్రతిభ అవార్డులు





ఇన్‌చార్జి మంత్రి రోజా నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, సీఐ కిషోర్‌బాబు

పెనమలూరు: మండల పరిధిలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, సీఐ ఎం.కిషోర్‌బాబుకు ప్రతిభ అవార్డులు వచ్చాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్కే రోజా ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు. తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య జగనన్న సరక్ష కార్యక్రమంలో జిల్లాలోనే అత్యధికంగా 27 వేల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినందుకు అవార్డు వచ్చింది. శాంతిభద్రతల విషయంలో ఉత్తమ సేవలు అందించినందుకు పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబుకు ప్రతిభ అవార్డు అందచేశారు. పెనమలూరు ఎంఈఓ 2 కనకమహాలక్ష్మి, కానూరు వీఆర్వో సీహెచ్.శ్రీనివాస్‌కు కూడా ప్రతిభ అవార్డు ఇచ్చారు. పెనమలూరు సెంటర్‌లో స్వచ్ఛందంగా ట్రాఫిక్ సేవలు అందిస్తున్న గంగూరు గ్రామ నివాసి ఎరికపాటి సురేష్‌కు విజయవాడలో ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు అవార్డు అందచేశారు.

సమరయోధులకు స్వరాంజలి



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన స్వరాంజలి ఆకట్టుకుంది. పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సాంస్కృతిక సేవా సంస్థ, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీకళాభారతి సంస్థల ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత మహోత్సవ్, 77 స్వాతంత్ర్య దినోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా సమరయోధులకు గాయని చల్లా నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన గాయనీ గాయకులు దేశభక్తి గీతాలు పాడారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడారు. పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు చల్లా బాలకొండయ్య, వివిధ సంస్థల ప్రతినిధులు డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



పేరంటాలమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



పెదపులిపాకలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బుధవారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 12 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు హోమగుండం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి, ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ పాల్గొన్నారు.గురువారం నుంచి పేరంటాలమ్మకు పరోక్షంగా గోత్ర నామాలతో పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. గోత్ర నామాలతో పూజ చేయించుకోవాలనుకునే భక్తులు ఆలయ కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెదపులిపాకలో చండీ హోమం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న విజయరాజరాజేశ్వరి, విజయసుందరేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాస అమావాస్య సందర్భంగా వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో సామూహిక అర్చన చేశారు. భక్తులచే చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పుష్పార్చన చేసి పల్లకీ సేవ, పవలింపు సేవ చేవారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న స్వరూప

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకుని చిన్నతరహా పరిశ్రమలను స్థాపించి రాష్ట్ర, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలు వై.స్వరూప అన్నారు. స్థానిక రావి చెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో బుధవారం ఆజాది భారత్ అంశంపై పెయింటింగ్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో స్వరూప మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులపై యువత దృష్టి పెట్టాలన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్న మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వివిధ వృత్తి విద్యా కోర్సులను ఉపయోగించుకుని స్వయం ఉపాధితో పాటుగా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించి మరికొంత మందికి ఉపాధి కల్పించవచ్చునని చెప్పారు. పెయింటింగ్ పోటీల్లో కె.శ్రావణి, టి.గానమాధురి, సత్యవేణి వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు.

ఈ-క్రాప్‌తో అన్నదాతకు భరోసా



కంకిపాడులో ఈ-క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏఓ కిరణ్



గండిగుంటలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ నిస్సి గ్రేస్

కంకిపాడు: ఈ-క్రాప్ నమోదుతో అన్నదాతలకు భరోసా ఏర్పడుతుందని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ అన్నారు. కంకిపాడులో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. యాప్‌లో రైతులు, పంట వివరాలను నమోదు చేశారు. ఏఓ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సబ్సిడీ పథకాలు, ఎరువులు, విత్తనాలు, పంట విక్రయాలు ఏవి లబ్ధిచేకూరాలన్నా ఈ-క్రాప్ తప్పనిసరి అన్నారు. రైతులు తమ వివరాలను రైతుభరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులకు అప్పగించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం వ్యవసాయ క్షేత్రానికి సిబ్బంది వచ్చి ఈ-క్రాప్ నమోదు చేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని చెప్పారు. అభ్యంతరాలు ఉంటే సోషల్ ఆడిట్‌లో తెలియజేయాలని పేర్కొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఉయ్యూరు: ఈ-క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏవో నిస్సి గ్రేస్ అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో చేపట్టిన ఈ-క్రాప్ నమోదును బుధవారం ఆమె పరిశీలించారు. ఏ సర్వే నంబరులో ఏ పంట నమోదు చేశారో, రైతు వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

గర్భిణుల సేవలో సత్యసాయి సేవా సమితి

- నాలుగేళ్లుగా గర్భిణులకు ఉచిత భోజనం
- మానవత్వం చాటుతున్న సభ్యులు



పెనమలూరు ఆరోగ్య కేంద్రం వద్ద ఉచిత భోజనం పెడుతున్న సభ్యులు

పెనమలూరు: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణులకు శ్రీ భగవాన్ సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కల్పిస్తున్నారు. పేద మహిళలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షలకు వచ్చే సమయంలో అండగా ఉంటూ వారి ఆకలి తీర్చడానికి నాణ్యమైన ఉచిత భోజనం అందిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సత్యసాయి సేవాసమితి సభ్యులు గర్భిణుల పట్ల చూపుతున్న ఆదరణ వెలకట్టలేని విధంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా శ్రీ భగవాన్ సత్యసాయి సేవా సమితికి అనుబంధంగా మండలాల్లో సత్యసాయి భజన మండళ్లు ఉన్నాయి. పేద మహిళలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో శ్రీసత్యసాయి సేవా సమితి ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గర్భిణుల స్థితి గతులపై సర్వే నిర్వహించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గర్భిణులు వైద్య పరీక్షలు చేసుకోవటానికి వచ్చిన సమయంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రుల వద్దే ఉంటున్నారని గుర్తించారు. ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండటం, ఆయా ప్రాంతాల్లో హోటల్స్ లేకపోవటంతో గర్భిణులకు భోజన వసతి లేక పోవటంతో ఆస్పత్రుల వద్ద చాలా ఇబ్బందులు పడుతున్నారని సర్వేలో గుర్తించారు. దీంతో గర్భిణులకు బాసటగా నిలవటానికి సేవా సమితి భోజన పథకం అమల్లోకి తీసుకొచ్చారు.

ప్రతి నెలా 9వ తేదీన....

ప్రతి నెల 9వ తేదీన గర్భిణులు వైద్య పరీక్షలకు వస్తున్నారు. మాతా శిశు సంక్షేమంలో భాగంగా శ్రీ సత్యసాయి సేవాసమితి గర్భిణులకు, వారి వెంట వచ్చే సహాయకులకు ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు జిల్లాలో పలు ఆరోగ్య కేంద్రాల వద్ద భోజన వసతి ఆయా ప్రాంతాల్లో ఉన్న భజన మండళ్లు ఏర్పాటు చేసి కడుపు నిండా భోజనం పెడుతున్నారు. పెనమలూరులో గత నాలుగు సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సొంత నిధులతోనే సేవ..

శ్రీ సత్యసాయి సేవాసమితికి చెందిన భక్తులు ఆయా ప్రాంతాల్లో సొంతగా నిధులు ఖర్చు చేసి నాణ్యమైన భోజనం సభ్యుల ఇళ్ల వద్దే తయారు చేసి ఆరోగ్య కేంద్రాలకు తీసుకు వస్తున్నారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితి దృష్టిలో ఉంచుకోని నాణ్యమైన భోజనం పోషకాలతో తయారు చేస్తున్నారు. భోజనంలో రోటి పచ్చడి, వేపుడు కూర, పప్పు, సాంబారు, పెరుగు పెడుతున్నారు. ఈ భోజన వసతి కార్యక్రమం నిరంతరంగా కొనసాగిస్తామని సభ్యులు తెలుపుతున్నారు.

పేద మహిళలకు మేలు



వైద్య పరీక్షలకు వస్తున్న గర్భిణులకు సత్యసాయి సేవాసమితి ఉచిత భోజనం పెట్టడం అభినందనీయం. భోజన పథకం కొనసాగిస్తే చాలా మందికి మేలు కలుగుతుంది. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా పేద మహిళలకు సేవచేయటంతో ఎంతో ఆనందంగా ఉంది.

– కరిష్మా, పోరంకి

నిరంతరంగా భోజన వసతి



శ్రీభగవాన్ సత్యసాయి సమితిచే పీహెచ్‌సీల వద్ద అమలు జరుగుతున్న ఉచిత భోజన పథకం నిరంతరంగా అమలు చేస్తాము. పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులు తమ వద్ద భోజనం చేయాలి. గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే తమ లక్ష్యం.

– ఉయ్యూరు రమణ, సత్యసాయి సేవాసమితి సభ్యురాలు

పంట కోత ప్రయోగంపై శిక్షణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కె.సీతారామపురం రైతుభరోసా కేంద్రంలో పంట కోత ప్రయోగం నిర్వహణపై గ్రామ వ్యవసాయ, గ్రామ ఉద్యాన అసిస్టెంట్లకు బుధవారం గణాంక శాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. గుడివాడ డివిజనల్ అర్థ గణాంక అధికారి ఎం.ఆనంద్ కుమార్, మండల అర్థ గణాంక అధికారి కె.అప్పారావు పంట కోత ప్రయోగం గురించి వివరించారు. వరి, మొక్కజొన్న, మినుము, పెసర, చెరకు పంటల్లో కోత ప్రయోగాన్ని ఏ విధంగా నిర్వహించాలి, పొలాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలో వివరించారు. అలాగే పంటకోత ప్రయోగం వివరాలను యాప్, ఆన్‌లైన్‌లో ఏ విధంగా పొందుపర్చాలో తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని పాల్గొన్నారు.